# దైవప్రేమద్వారానే దైవత్వ ప్రాప్తి

మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుంపెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
డంబైన ఫాలనేత్రంబుతోడ
నల్ల నేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగ కంకణముతోడ
నడుమున చుట్టిన నాగచర్మముతోడ
మైనిండనలదు భస్మంబుతోడ
నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబు తోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామన చాయల మేనితోడ
శైల రాజేంద్రుడు నేడు సాక్షాత్కరించె

***ప్రేమస్వరూపులారా!***

సర్వమూ దక్షిణామూర్తిమయమే. అతనియొక్క రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్... ఈ మూడింటియొక్క ప్రభావమే ఈ ప్రపంచము. దక్షిణామూర్తి బాలుడే! నాడు, నేడు ఎప్పటికికూడను అతను బాలుడే! అయితే, అతని శిష్యులు మహాపవిత్రులై, పండితులై అనేకవిధములైన ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చారు. అతనిది మౌన బోధ. ఆ మౌనమే

srisathyasaivachanamrutam

సర్వులకు సర్వ జ్ఞానమును ప్రసాదించును. ఆ మౌనమునుండియే సుజ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానములు ఆవిర్భవించుచున్నవి.

మానవునిది ఒక్క స్వరూపము కాదు, మూడు స్వరూపములు అతనిలో చేరియున్నవి. 1. The one you think you are (నీవనుకునే నీవు) 2. The one others think you are (ఇతరులనుకునే నీవు) 3. The one you really are (అసలైన నీవు). దక్షిణామూర్తి తనయొక్క ప్రచార ప్రబోధలవల్ల మానవులను తమ నిజతత్త్వాన్ని గుర్తించేరీతిగా తీర్చిదిద్దుతూ వచ్చాడు. అతను తేజస్సుతో, ప్రకాశముతోకూడిన సహజమైన స్వరూపాన్ని ధరించాడు. అతని మోముపై నిరంతరం చిరునవ్వులు చిందులు త్రొక్కుతూ ఉంటాయి. 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. అట్టి దక్షిణామూర్తియొక్క స్వభావమును ఏవిధంగా వర్ణించినను ఎవ్వరూ ప్రపంచంలో అర్థం చేసుకోలేరు. 'దక్షిణామూర్తి' అనగా అతని మూర్తి ప్రకాశవంతమైనది, ఆనందమయమైనది. అతను ప్రేమస్వరూపుడు, సత్యస్వరూపుడు.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్య మహిమలేని స్థలమేది కనుగొన్న?**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య**

సత్యము లేని స్థానము ఎక్కడను లేదు. ఏ పదార్థమునకైనను మార్పు కలుగునుగాని, సత్యమునకు మార్పే లేదు. ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి ఎక్కడైనా కచేరీ ప్రారంభించడానికి ముందుగా దక్షిణామూర్తిని స్మరించేది. దక్షిణామూర్తియొక్క స్మరణ లేకుండా, ఆయన ఇచ్ఛ లేకుండా, ఆయన సంకల్పము లేకుండా మానవుడు ఏ చిన్న కార్యమునుకూడను సాధించలేడు. దక్షిణామూర్తినుండియే సర్వమూర్తులుకూడను బయలు దేరినవి. కాని, తాను మాత్రం ఎప్పటికీ బాలుడే! సర్వమూ తనయందే లీనమైయున్నవి.

**చైతన్య స్వరూపమే దక్షిణామూర్తి**



srisathyasaivachanamrutam

**తేదీ 11.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు**

ఈశ్వరతత్వము సర్వత్రా వ్యాపించినటువంటిది. భగవంతుడు లేనటువంటి స్థానము, భగవంతుడు కానటువంటి వస్తువు ఈ జగత్తులో కానరాదు. ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తి, ప్రతి జీవి, క్రిమికీటకాదులు కూడను దక్షిణామూర్తియొక్క ప్రభావములే!

**'సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరో ముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

దృశ్యమును చూచే కన్నులయందు, శబ్దమును వినే కర్ణములందు, శ్వాస పీల్చే నాసికమునందు, మాటలు పలికే నాలుకయందుకూడను దక్షిణామూర్తి ఉన్నాడు. దక్షిణామూర్తి సర్వులయందు ఉంటున్నాడు. ఇట్టి దక్షిణామూర్తి తత్వాన్ని మనస్సునందు తల్చుకొని జీవితాన్ని నడిపించాలి. 'రామా', 'కృష్ణా', 'గోవిందా', 'నారాయణా' అని భగవంతుని వివిధ నామాలతో కీర్తిస్తుంటారు. కాని, ఈ నామములన్నీ పెట్టినవేగాని, పుట్టినవి కావు. అన్ని నామములుకూడను దక్షిణా మూర్తియొక్క వర్ణనలే! దక్షిణామూర్తియొక్క తత్వము సర్వులయందుకూడను వ్యాపించియున్నది. చైతన్య స్వరూపమే దక్షిణామూర్తి. కనుకనే, చైతన్యము ఎక్కడ ఉన్నదో అక్కడ దక్షిణామూర్తి ఉన్నాడు. ఈ 'కాన్షియస్‌నెస్' అనేది సర్వులయందు ఉన్నది. కాని, మానవుడు దేహాభిమానముచేత తనయందున్న చైతన్యమును గుర్తించుకోలేకపోతున్నాడు. దేహము, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము ఈ ఐదింటియొక్క ప్రభావము చేతనే దక్షిణామూర్తి కనిపించకుండా ఉంటున్నాడు. వీటిపైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గములు కప్పి ఉన్నవి. ఈవిధంగా మనల్ని ఆవరించిన 'మేఘముల'ను ప్రక్కకు నెట్టినప్పుడే దక్షిణామూర్తి స్వస్వరూపుడై మనకు ప్రత్యక్షమవుతాడు.

ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు మేఘములు కప్పినప్పుడు మనకు కనిపించడు. అంతమాత్రముచేత సూర్యుడు లేడని చెప్పవచ్చునా? కొంతసేపు కాచుకొని ఉంటే, తప్పక మేఘములు కదలిపోతాయి, సూర్యుడు కనిపిస్తాడు. అదేరీతిగా, మానవుడు తనను కప్పియున్న కామ, క్రోధాది అరిషడ్వర్గములనే మేఘములను దూరం గావించుకోవాలి. ఏవిధంగా? చల్లని గాలి వీచినప్పుడు మేఘములు కదలిపోతాయి. అదేవిధముగనే, భగవన్నామమనే 'చల్లని గాలి' వీచినప్పుడు మానవుణ్ణి కప్పియున్నటువంటి

sri sathyasai vahamrutam

అరిషడ్వర్గములనే మేఘములు తొలగిపోతాయి. కాబట్టి, మనము భగవన్నామమును ఉచ్చరిస్తూ, భగవచ్చింతన చేస్తూ ఉండాలి.

**దక్షిణామూర్తి బోధించినటువంటి సాధన**

కామ, క్రోధాది అరిషడ్వర్గములు మానవునికి పుట్టుకతో వచ్చినవి కావు. ఇవి మధ్యలో మనకై మనము కల్పించుకొని పెంచుకున్నటువంటివే! ఇవి ఒక్కొక్కటి చిన్నచిన్నగా చేరుతాయి; తర్వాత అవి ఒక పెద్ద మేఘంగా తయారౌతాయి. పెరిగేకొలదీ మానవునికి కోరికలుకూడా పెరుగుతుంటాయి. చేతికి ఒకే గాజు ఉన్నప్పుడు అది శబ్దం చేయదు. రెండు గాజులు చేరినప్పుడు శబ్దం ప్రారంభ మవుతుంది. మొట్టమొదట మానవుడు ఒకే వ్యక్తిగా ఉంటాడు. కొంతకాలమునకు అతనిలో భ్రాంతి అభివృద్ధి అవుతుంది. అదే కామము. దానివల్ల భార్య వస్తుంది. అప్పుడు ఇద్దరవుతారు. ఈ ఇద్దరే క్రమక్రమేణ పన్నెండుమంది అవుతారు. అనగా ఏమిటి? వాళ్లకి పిల్లలు పుడతారు. మళ్ళీ ఆ పిల్లలకి పిల్లలు పుడతారు. ఈరీతిగా సంబంధ బాంధవ్యములు పెరుగుతూ పోతాయి. ఇవన్నీ మనం పెంచుకొనేటటు వంటివేగాని, భగవంతుడు ప్రసాదించినవి కావు కదా! కనుక, చిన్నవయస్సునందే మనం భ్రాంతికి చోటివ్వకుండా చూసుకోవాలి. దక్షిణామూర్తి బోధించినటువంటి సాధన ఇదే! తాను ఎట్టి బంధములందూ చిక్కుకోలేదు; ఎప్పుడుకూడను చిన్నపిల్లవాడివలె ఉంటూ వచ్చాడు. దక్షిణామూర్తి అనుగ్రహమును అందుకోవా లంటే మీరు దక్షిణామూర్తి మార్గమును అనుసరించాలి.

**'నేను దేహాన్ని కాదు, దైవాన్ని' అని విశ్వసించు**

మానవుడు మానవతా గుణములను పోషించుకొని మానవునిగా జీవించాలి. అప్పుడే మానవుడనని చెప్పుకోవడానికి తనకు అధికారముంటుంది. లేకపోతే తాను పశువుగా మారిపోయే ప్రమాదముంది. పశువులయందే కామ, క్రోధాదులు అధికంగా ఉంటాయి. ప్రతి వ్యక్తి, 'నేను మానవుడను, పశువును కాదు', అని తనకు తాను గుర్తు చేసుకుంటూ ఉండాలి. 'నేను కేవలం మానవుడను కాదు, నేను దైవాన్ని' అని విశ్వసించాలి. ఈ సత్యాన్ని గుర్తించటంలో మానవునికి మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, అహంకారము

sri sathyasai vachanamrutam

ఇవన్నీ అడ్డు తగులుతుంటాయి. 'ఇది నా కర్చీఫ్' అంటున్నాను. కాబట్టి కర్చీఫ్ వేరు, నేను వేరు. అదేరీతిగా, 'ఇది నా దేహము' అంటావు. కనుక, దేహము వేరు, నీవు వేరు. 'నా మైండు' అన్నప్పుడు నీవు వేరు, మనస్సు వేరు. మరి నీవెవరు? వీటన్నింటికంటే నీవు ప్రత్యేకంగా ఉండడంచేతనే కదా 'ఇది నా దేహము, నా మనస్సు' అని చెప్ప గల్గుతున్నావు. కాబట్టి, నీవు నీవే! నీవు దేహము కాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు, చిత్తము కాదు. ఇవన్నీ నీవు చేర్చుకోవడంచేతనే బంధితుడవైపోయావు. ఒక్కొక్కదానిచేత నీవు ఒక్కొక్క విధమైన గుణమును పెంచుకుంటున్నావు.

**మాయ లేకుండా వర్తించేవాడు మానవుడు**

వక్కపొడి, తమలపాకు, సున్నము – ఈ మూడూ కలిపినప్పుడు తాంబూలం తయారవుతుంది. సున్నము కలిపినప్పుడే ఎరుపు రంగు వస్తుంది. అయితే, దానిని అధికంగా వేసుకోకూడదు; తక్కువగానే వేసుకోవాలి. అదేరీతిగా, ప్రతి ఒక్క బాధ్యతను మానవుడు ఒక 'లిమిట్'లో ఉంచుకోవాలి. మనిషి అనేవాడు ప్రతి విషయంలోను ఒక పరిమితిని పాటించినప్పుడే తాను మనిషిగా జీవించ గల్గుతాడు. హద్దులు మీరితే వాడు రాక్షసుడౌతాడు. మానవుడు మానవునిగా బ్రతకాలి. 'మానవ' అనే పదములో 'మా' అనగా మాయ; 'న' అనగా లేకుండా; 'వ' అనగా వర్తించడం. కాబట్టి, మాయ లేకుండా ప్రవర్తించినప్పుడే నీవు నిజమైన మానవుడవవుతావు. నీవు దేహమును ధరించినటువంటివాడవైనప్పటికీ దేహముతో ఏమాత్రము సంబంధము పెట్టుకోకూడదు. ఇట్టి పవిత్రమైన జ్ఞానమును బోధించినవాడు దక్షిణామూర్తి.

ప్రేమస్వరూపులారా! మనలో ప్రధానంగా ఉన్నటువంటిది ప్రేమయే! మొట్టమొదట తల్లి మనకు అందించినటువంటిది ప్రేమయే! ప్రేమయే దైవం. నీవు ప్రేమతోనే జీవించాలి. ఎవరిని చూసినా నీవు దైవస్వరూపునిగానే భావించాలి. నిన్ను ద్వేషించేవాడు నీకెదురైతే వానికికూడా నీవు నమస్కరించాలి. అప్పుడే నీవు సరియైన మానవుడవనిపించుకుంటావు. "మనసుకు మనసు సాక్షి; దేహమునకు గుణం సాక్షి; మూఢునకు మూర్ఖం సాక్షి; సర్వమునకు స్వామి సాక్షి." మనం మూఢులం కాకూడదు. మనం మూఢుల్లో చేరినప్పుడే మనకు అన్ని విధాలుగా బాధలు, భేదాలు కలుగుతుంటాయి. అయితే, ఈ జగత్తులో

sri sathyasai vachanamrutam

మూఢుడు కానటువంటివాడు ఒక్కడూ లేడు. కాని, వారిలో స్థాయిలు వేరువేరుగా ఉన్నాయి.

ప్రేమస్వరూపులారా! నిరంతరం భగవచ్చింతన చేసేవాడు చాలా ఉత్తముడు. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం'. మీ దేహాన్నికూడను మీరు భగవత్కార్యములో ప్రవేశపెట్టాలి. మీ జీవితమే భగవన్మయంగా మారాలి. మానవుడు 'డివైన్ లైఫ్'ను గడిపినప్పుడే అతనికి బుద్ధి వికాసం కలుగుతుంది. మీరు 'డివోషన్'ను అభివృద్ధిపరచుకున్నప్పుడే మీ జీవితం 'డివైన్'గా రూపొందుతుంది; మీ మానవత్వం సార్థకమవుతుంది; మీ జన్మ తరిస్తుంది. మీరు మొట్టమొదట మానవులుగా జీవించాలి; అప్పుడే మాధవత్వాన్ని పొందగలరు. త్రేతాయుగంలో రాముని మానవునిగానే భావించారు మొట్టమొదట. కాని, రావణ సంహారం గావించి దుర్గుణాలను అణచివేసిన తరువాత జనుల దృష్టిలో రాముడు దేవుడుగా మారినాడు. అరిషడ్వర్గములతో కూడివున్నంతవరకు మనము ఆనందాన్ని అనుభవించలేము. నీవు ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. ఎందుకనగా, దైవము ఆనందస్వరూపుడు.

**'నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణ రహితం....'**

ఇట్టి ద్వంద్వాతీత స్థితిలో జీవించినప్పుడే మనం నిజమైన మానవులుగా రూపొందుతాము. ఏమైనా దుర్గుణాలు నీలో బయలుదేరెనా, వాటిని దూరం చేసుకునే నిమిత్తం నీవు భగవన్నామమును స్మరించు. దైవాన్ని స్మరిస్తే నీవుకూడా దైవంగా మారిపోతావు.

ప్రేమస్వరూపులారా! ప్రేమ లేకుండా ఒక్క క్షణమైనా మీరు ఉండలేరు. కాని, మీరు ప్రేమను ఎన్ని రకములుగానో మార్చుకుంటున్నారు. దైవప్రేమను అభివృద్ధిపరచుకొని, ప్రేమస్వరూపులుగా జీవించండి. క్రమక్రమేణ దైవత్వాన్ని పొందండి. ఇదే ఈనాడు నేను మీకందించేటటువంటి ముఖ్యమైన సందేశం.

**(తేదీ 11.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

srisathyasaivachanamrutam